ర్యాలీకి అనుమతి ఇవ్వాలని ఏసీపీకి వినతి

అడ్డగుట్ట: మద్యం, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై తలపెట్టిన అవగాహన ర్యాలీకి అనుమతివ్వాలని కోరుతూ మద్యం, మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సభ్యులు గోపాలపురం ఏసీపీ సుబ్బయ్యకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ కన్వీనర్‌ నర్సింగ్‌రావు మాట్లాడుతూ.. ఈనెల 28న తుకారాంగేట్‌ నుంచి అడ్డగుట్ట చౌరస్తా వరకు ర్యాలీ చేపడుతామని పేర్కొన్నారు. అందించిన వారిలో సీఆర్పీఎఫ్‌ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఉన్నారు.

అన్నదానం

లాలాపేట: లాలాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమవాస్యను పురస్కరించుకుని లాలాపేటలోని ప్రొ జయశంకర్‌ స్టేడియం వద్ద మంగళవారం అన్నదానం నిర్వహించారు. అంతకు ముందు వాసవీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో లాలాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మడిపడగ శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి పందరి సాంబశివ రావు, కోశాధికారి యెనిశెట్టి భాస్కర్‌ ఉన్నారు.

పోస్టర్‌ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: దళితులపై దాడిని నిరసిస్తూ ఈనెల 30న చేపట్టిన 'చలో బోరిగాం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు పిలుపునిచ్చారు. పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. విద్యార్థి సంఘాల నేతలు శ్రీకాంత్‌, కోట శ్రీనివాస్‌గౌడ్‌, సుమంత్‌, రుక్మత్‌ పాషా, ఉదయ్‌, హరీశ్‌, అఖిల్‌, ముత్యం, అరుణ్‌, అనిల్‌, శివ, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌ సిగ్నలింగ్‌ కేబుల్స్‌ ధ్వంసం: ఒకరిపై కేసు

సనత్‌నగర్‌: వాటర్‌వర్క్స్‌కు చెందిన కాంట్రాక్టర్‌ రోడ్డును తవ్వించే క్రమంలో ట్రాఫిక్‌ సిగ్నలింగ్‌ కేబుల్స్‌ను ధ్వంసం చేశారంటూ బాలానగర్‌ ట్రాఫిక్‌ ఎస్‌ఐ ఫిర్యాదు మేరకు సనత్‌నగర్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే..బాలానగర్‌ ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న భానుప్రసాద్‌ ఈనెల 17న సాధారణ తనిఖీలు చేస్తున్న సమయంలో ఎర్రగడ్డ వద్ద సిగ్నల్‌ పనిచేయకపోవడం గమనించగా వాటర్‌వర్క్స్‌ కాంట్రాక్టర్‌ సంపంగి రవీందర్‌ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా రోడ్డును తవ్వగా సిగ్నలింగ్‌కు సంబంధించి అక్కడి కేబుల్స్‌ ధ్వంసమయ్యాయి. వీటి విలువ రూ.72 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్‌ నిజాయితీ

2.08 లక్షల బ్యాగ్‌ అప్పగింత

బొల్లారం: మదీనలో షాపింగ్‌ చేసి ఆటోలో తిరుమలగిరి వెళ్లిన వికారాబాద్‌కు చెందిన మహేందర్‌ కుటుంబం రూ. 2.08 లక్షల నగదు ఉన్న బ్యాగ్‌ను ఆటోలోనే మరిచి పోయారు. వెంటనే తిరుమలగిరి పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌హెచ్‌వో నాగరాజు, ఎస్‌ఐ ప్రశాంత్‌ నేతృత్వంలో క్రైం టీం సుమారు 60 సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి, బ్యాగ్‌ మర్చిపోయిన ఆటోను, డ్రైవర్‌ బి. నాగరాజును ఆదర్శనగర్‌లో ఉన్నట్లు గుర్తించారు. కాగా ఆటో డ్రైవర్‌ తిరుమలగిరి పోలీస్‌ స్టేషన్‌లో మంగళవారం వచ్చి బ్యాగ్‌ను అప్పగించాడు. దీంతో డ్రైవర్‌ను అధికారులు అభినందించారు. అనంతరం బ్యాగ్‌ను బాధితుడికి అప్పగించారు.

ఓయూ ప్రొఫెసర్ల క్వార్టర్ల లీజు రద్దు చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ల క్వార్టర్ల లీజు రద్దు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్‌ చేశారు. ఈ మేరకు ఆర్ట్స్‌ కాలేజీ ఎదుట నిరసన తెలిపిన అనంతరం ఆది ధ్వని, ఆద్య కళ స్వచ్ఛంద సంస్థలకు కారుచౌకగా ఇచ్చిన 30 ఏండ్ల లీజును రద్దు చేయాలని రిజిస్ట్రార్‌ ప్రొ.నరేశ్‌ రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆసుపత్రి ఎదుట గల కోట్ల విలువ చేసే పి1, పి2, పి3 క్వార్టర్లను నెలకు కేవలం రూ.1000 అద్దెకు ఇవ్వడం సిగ్గు చేటన్నారు. ఓయూ భూమిని సర్వే చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాలని డిమాండ్‌ చేశారు. ఏఐఎస్‌ఎఫ్‌ నేతలు లెనిన్‌, నెల్లి సత్య, ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఉదయ్‌కుమార్‌, దండు అజయ్‌ కుమార్‌, పీడీఎస్‌యూ నేత రాకేశ్‌ పాల్గొన్నారు.

లీజును అడ్డుకోవడం తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ప్రొఫెసర్ల క్వార్టర్ల లీజును అడ్డుకోవడం తగదని పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కోట ఆనంద్‌ మంగళవారం పేర్కొన్నారు. జస్టిస్‌ చిన్నప్ప రెడ్డి కమిషన్‌ ప్రకారమే సైన్స్‌, ఆర్ట్స్‌, సామాజిక శాస్త్రాల పరిశోధక విద్యార్థుల ప్రయోగశాల కోసమే ఓయూ అధికారులు క్వార్టర్లను అద్దెకు ఇచ్చారని తెలిపారు. అలాగే గతంలో విద్యార్థులకు ఎలాంటి ఉపయోగం లేని ఓయూ భూములను సంస్థలకు లీజుకు ఇచ్చారని వివరించారు. విద్యార్థుల పరిశోధనతో పాటు ఆదివాసీల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి బింబించే వస్తువులను భద్రపరిచేందుకు ఆది ధ్వని, ఆద్యకళ సంస్థలకు పాతపడి నిరుపయోగంగా ఉన్న అధ్యాపకుల క్వార్టర్లను లీజుకు ఇవ్వడంలో నష్టం లేదన్నారు. ఓయూ అధికారుల నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మురుగు..పరుగు ఆగేదెన్నడో..?

- నెలరోజులుగా సజ్జన్‌లాల్‌ స్ట్రీట్‌ ప్రధాన రహదారిలో ప్రవాహం
- దుర్వాసనతో స్థానికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



సజ్జన్‌లాల్‌స్ట్రీట్‌ ప్రధాన రహదారిలో పారుతున్న మురుగునీరు

బన్సీలాల్‌పేట్‌: మోండా మార్కెట్‌ డివిజన్‌ మారుతీవీధి సజ్జన్‌లాల్‌ స్ట్రీట్‌ ప్రధాన రహదారిలో మురుగు ప్రవాహంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు నెల రోజులుగా ఏకధాటిగా పారుతూ..నే ఉన్న అటు జలమండలి, ఇటు జీహెచ్‌ఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. మోండా మార్కెట్‌కు కూతవేటు దూరంలోని ఈ రోడ్డు నిత్యం వందలాది వాహనాలు..పాదచారుల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. రోజుల తరబడి మురుగు ప్రవాహం..దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు.. ఇటు గిరాకీ పూర్తిగా తగ్గిపోయిందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే చాలు.. వర్షం పడితే చాలు సజ్జన్‌లాల్‌ స్ట్రీట్‌ రోడ్డు వరదతో చిన్నపాటి చెరువును తలపిస్తోంది. మోకాలి లోతు వరకు నీరు వచ్చి చేరుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. మరోవైపు లోతట్టు ప్రాంతం కావడంతో నీరు ఇండ్లలోకి వచ్చి చేరుతుందని స్థానికులు వాపోతున్నారు.



బురదమయంగా వీధి

నాలాపై నిర్మాణాలు..

గతంలో ఈ రహదారిలో వరద, డ్రైనేజీ నీరు సాఫీగా వెళ్తుండేది. అయితే కొంతకాలంగా నాలాలపై అక్రమ నిర్మాణాల కారణంగా అవి కుచించుకుపోవడంతో వరద ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా సంబంధిత విభాగాల అధికారులు తగు చర్యలు తీసుకుని శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

సజ్జన్‌లాల్‌స్ట్రీట్‌లో మురుగునీటి వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇప్పటికే తమ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశాం. ఒకటి, రెండు రోజుల్లోనే సమస్య పరిష్కారానికి పూర్తి స్థాయి చర్యలు చేపడుతాం.

–దీఈ ఆంజనేయులు

ప్రభుత్వ స్థలం పరిరక్షణకు చర్యలు



స్థలంలో బోర్డు ఏర్పాటు చేసిన హైడ్రా, జీహెచ్‌ఎంసీ అధికారులు

సికింద్రాబాద్‌: నార్త్‌లాలాగూడలో ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు జీహెచ్‌ఎంసీ, హైడ్రా అధికారులు చర్యలు ప్రారంభించారు. ఇరువిభాగాల అధికారులు నార్త్‌లాలాగూడ ఇందిరమ్మ కాలనీని మంగళవారం సందర్శించి సర్వే నంబర్‌ 781లో గల 840 చదరపు గజాల భూమిపై ఎవరికీ హక్కులు లేవంటూ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన ఈ స్థలం తమదని కొందరు వ్యక్తులు ఇతరులకు విక్రయిస్తుండడం, కోర్టును ఆశ్రయిస్తుండడంతో 1990 నుంచి ఈ భూమి వివాదాస్పదంగా ఉన్నది. తాజాగా ఈ స్థలంపై ప్రైవేట్‌ వ్యక్తులకు హక్కులు లేవని, ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకుని ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలని న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ ఏసీపీ బీవీ.శ్రీనివాస్‌రావు, హైడ్రా ఇన్‌స్పెక్టర్‌ ఆదిత్య, న్యాక్‌ ఇంజినీర్‌ ప్రకాశ్‌ బోర్డును ఏర్పాటు చేయించారు.

బ్రాహ్మణవాడీలో పాదయాత్ర



బ్రాహ్మణవాడీలో పర్యటిస్తున్న అధికారులు, నీలిమా

సనత్‌నగర్‌: టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ ఇన్‌చార్జి కోట నీలిమా వాటర్‌వర్క్స్‌ జీఎం వినోద్‌కుమార్‌, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ దాకూనాయక్‌, ఎలక్ట్రికల్‌ ఏఈ సాయికుమార్‌తో పాటు వివిధ విభాగాల అధికారులు మంగళవారం బేగంపేట బ్రాహ్మణవాడీలో మాన్సూన్‌ ప్రిపరేటరీ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వరద కాలువలను వెంటనే శుభ్రం చేయాలని, విద్యుత్‌ సరఫరాలో అంతరాయం లేకుండా చూడడం, నీటి నిల్వ ఉండకుండా చూడడం, భారీ వర్షాల సమయంలో ప్రజల ఆరోగ్యం, భద్రతకు ముందస్తు ప్రణాళికలు తీసుకోవాలని ఆమె సూచించారు. కాంగ్రెస్‌ సీనియర్‌ నేతలు విశాల్‌ సూదం, సలీంఖాన్‌, హనీఫ్‌ఖాన్‌, మనోజ్‌కుమార్‌, నసీర్‌ (అడ్డూ), కృష్ణ, అల్తమాస్‌, చిరంజీవి, తస్లీమ్‌, సబా, జగదీష్‌, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో మాసివ్‌ ఫాగింగ్‌ ప్రారంభం



ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌ పరిధిలో లింగాని ప్రసన్నలక్ష్మి ఎంటామాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి మాసివ్‌ ఫాగింగ్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రజల సహకారం కూడా అవసరమని, సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై ఇండ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ నాయకులు లింగాని శ్రీనివాస్‌, ఎంటమాలజీ ఏఈ సునీత, సిబ్బంది యూనిస్‌, దాస్‌, ఇర్ఫాన్‌, హుస్సేన్‌ పాల్గొన్నారు.

ఇండస్ట్రీస్‌ సమస్యల పరిష్కారానికి కృషి

కేంద్రమంత్రి జితేన్‌రామ్‌ మాంజీ



కేంద్రమంత్రి జితేన్‌రామ్‌ మాంజీకి వినతిపత్రం ఇస్తున్న ప్రకాశ్‌, సతీశ్‌

సనత్‌నగర్‌: ఎంఎస్‌ఎంఈ సెక్టార్‌లో ట్రేడర్స్‌, టెక్స్‌టైల్స్‌ ఇండస్ట్రీస్‌ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కేంద్రమంత్రి జితేన్‌రామ్‌ మాంజీ అన్నారు. బేగంపేటలోని టూరిజం ప్లాజాలో తెలంగాణ ఫెడరేషన్‌ ఆఫ్‌ చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ మంగళవారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధానంగా ట్రేడర్స్‌, టెక్స్‌టైల్‌ ఇండస్ట్రీ సమస్యలను చాంబర్‌ ప్రతినిధులు కేంద్రమంత్రికి వివరించారు. దీంతో పాటు ఫెడరేషన్‌ తరఫున ఇంటరాక్షన్‌ సమావేశంలో ఎంఎస్‌ఎంఈల తరహాలో ట్రేడర్స్‌కు కూడా సబ్సిడీ బ్యాంక్‌ రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని చాంబర్‌ అధ్యక్షుడు ప్రకాశ్‌, ప్రతినిధులు సతీశ్‌ కేంద్రమంత్రిని కోరారు. జీఎస్టీ స్లాబ్‌ల విషయంలో కూడా 5 శాతం చేయాలని విన్నవించారు. ఆన్‌లైన్‌ ప్లాట్‌ఫాం ప్రభావం వల్ల మీడియం, స్మాల్‌ ట్రేడర్స్‌కు నష్టం జరుగుతుందని మంత్రికి వివరించారు. వారి కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలని కోరారు. ఈ అంశాలపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు చాంబర్స్‌ ఆఫ్‌ కామర్స్‌ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం అమలయ్యేలా చూడాలి

అడ్డగుట్ట: ప్రైవేట్‌ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టం అమలయ్యేలా చూడాలని కోరుతూ తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్‌ జీ. భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు తెలంగాణ తల్లుల సంఘం, బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధులు కార్పొరేటర్‌ ప్రసన్నలక్ష్మికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డివిజన్‌ పరిధిలోని ప్రైవేట్‌ పాఠశాలలను సందర్శించి ఫీజుల దోపిడీని అరికట్టాలని కోరామన్నారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు చింతల లక్ష్మీనారాయణ, ప్రవీణ్‌ కుమార్‌, జమున, మమత, ఎంవీ. ఫౌండేషన్‌ ఆర్గనైజర్లు సువర్ణ, లావణ్య, మైత్రి, ఐశ్వర్య, సంతోష్‌, ప్రకాశ్‌ తదితరులు పాల్గొన్నారు.

అమ్మమ్మ మందలించిందని పారిపోయిన పిల్లలు

- తండ్రి వద్ద ఉన్నట్లు గుర్తించిన పోలీసులు

సనత్‌నగర్‌: అమ్మమ్మ మందిలించిందని మనస్తాపం చెందిన ఇద్దరు మనుమళ్లు ఇంటి నుంచి పారిపోగా అమ్మమ్మ ఫిర్యాదు మేరకు సనత్‌నగర్‌ పోలీసులు మిస్సింగ్‌ కేసుగా నమోదు చేసి గాలింపు చేపట్టారు. చివరకు బేగంపేటలో తన తండ్రికి వద్దకు వెళ్లినట్లు గుర్తించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళ్తే..ఫతేనగర్‌ పోచమ్మ ఆలయం దగ్గర ఉండే కిష్టమ్మ (38) హౌస్‌ కీపింగ్‌ వర్క్‌ చేస్తుంటుంది. తన కూతురు చనిపోగా ఆమె ఇద్దరు కొడుకులు అఖిల్‌ (9), నిఖిల్‌ (6) సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ హాస్టల్‌లో చదువుతున్నారు. కిష్టమ్మ వారం క్రితం హాస్టల్‌ నుంచి పిల్లలను తన ఇంటికి తీసుకువచ్చింది. సోమవారం మధ్యాహ్నం వారు అల్లరి చేస్తుండడంతో మందలించింది. మనస్తాపం చెందిన ఇద్దరూ బయటకు వెళ్లిపోయారు. ఆమె చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదు. అదేరోజు రాత్రి 11 గంటలకు సనత్‌నగర్‌ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పలుచోట్ల గాలించి తండ్రి గురించి కిష్టమ్మను అడగగా బేగంపేటలో ఉంటాడని చెప్పింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లగా పిల్లలిద్దరూ తండ్రి వద్దే ఉన్నారు. పిల్లలను పోలీసులు వారు ఉండే ప్రభుత్వ హోమ్‌కు తరలించారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య



సికింద్రాబాద్‌: సికింద్రాబాద్‌ రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్‌ పందరి కథనం ప్రకారం.. తెల్లవారుజామున 4.40 గంటల ప్రాంతంలో 10వ నంబర్‌ ప్లాట్‌ఫామ్‌ పైకి సెవెన్‌హిల్స్‌ ఎక్స్‌ప్రెస్‌ రైలు వస్తుండగా యువకుడు ఒక్కసారిగా పట్టాలపై దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అసోం రాష్ట్రం రాజ్‌పుక్‌రి గ్రామానికి చెందిన కైలాస్‌ సికర్‌నాథ్‌ (29)గా గుర్తించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన కై లాస్‌ సికర్‌నాథ్‌ వ్యక్తిగత కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్‌: సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో మంగళవారం ఎంఎంటీఎస్‌ రైలు కిందపడి వ్యక్తి మృతి చెందాడు. సికింద్రాబాద్‌ జీఆర్పీ హెడ్‌ కానిస్టేబుల్‌ డేవిడ్‌రాజు కథనం ప్రకారం.. సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్‌ ప్రాంతంలో మృతదేహం పడి ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. అయితే మృతుడి ఆచూకీ వివరాలు లభించలేదు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మరిన్ని వివరాలకు 9440083160 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు



బొల్లారం: సదర్‌బజార్‌లోని మహంకాళి ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. ప్రతి అమావాస్య రోజున అన్నదానం నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

బీసీలకు ప్రాధాన్యం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: పీసీసీ నియామకాల్లో బీసీలకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ కాంగ్రెస్‌ జాతీయ నాయకుడు రాహుల్‌ గాంధీకి లేఖ రాశానని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్‌ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. పేరుకే సామాజిక న్యాయం తప్ప ఆచరణలో పాటించడం లేదన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్‌ రెడ్డి ఒకే సామాజిక వర్గానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. మంత్రి పదవులతో పాటు ఇతర పదవుల్లోనూ బీసీలకు సముచిత స్థానం కల్పించాలని లేకుంటే బీసీ నాయకత్వం పార్టీకి దూరమయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

అమీర్‌పేట: అమీర్‌పేట నేచర్‌ క్యూర్‌ ఆసుపత్రి చుట్టు పక్కన గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో స్టేట్‌ టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన మూసాపేటకు చెందిన డోలా మధుసూదన్‌ (33)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 1.1 కిలోల గంజాయి లభించింది. మధుసూదన గతంలో కూడా గంజాయి విక్రయిస్తూ రెండు సార్లు పట్టుబడ్డాడని ఈ మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. తదుపరి విచారణ కోసం కేసును అమీర్‌పేట ఎక్సైజ్‌ పోలీసులకు అప్పగించారు.

ఓయూ విశ్రాంత ప్రొఫెసర్‌ రామకృష్ణ మృతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్‌ కాలేజీ చరిత్ర విభాగం విశ్రాంత అధ్యాపకుడు రామకృష్ణ బ్రెయిన్‌ స్ట్రోక్‌తో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. సుదీర్ఘకాలం ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌గా పని చేసిన ఆయన ఓయూ ప్రొ ఫెసర్‌గా బోధనా పరిశోధనలతో పాటు పలు పదవులు చేపట్టారు. తార్నాకలో నివాసం ఉంటున్న ఆయన కరీంనగర్‌ జిల్లా వాసి. 15 ఏళ్ల క్రితం ఉద్యోగ విరమణ అనంతరం తన స్వగ్రామంలో సర్పంచ్‌గా ప్రజలకు సేవలందించారు. ఈనెల 28న (నేడు) తార్నాకలోని హిందు శ్మశాన వాటికలో ఉదయం 10 గంటలకు అంత్యక్రియలు జరగనున్నట్లు చరిత్ర విభాగం అధ్యాపకుడు డా.రమేశ్‌ తెలిపారు.

పైపులైన్‌ పనులు షురూ



ప్రారంభించిన కార్పొరేటర్‌ సామల హేమ

సికింద్రాబాద్‌: మేడిబావిలోని దేద్‌ లాక్‌ బిల్డింగ్‌ వద్ద సీతాఫల్‌మండి కార్పొరేటర్‌ సామల హేమ జలమండలి అధికారులతో కలిసి వాటర్‌ పైప్‌లైన్‌ పనులను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రూ. 6 లక్షలతో వ్యయంతో పనులు చేపడుతున్నామన్నారు. ఈ పరిసర ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన పైప్‌లైన్‌తో కలుషిత నీరు సరఫరా కావడంతో పాటు లోప్రెషర్‌ వంటి సమస్యలు ఉత్పన్నమైనట్లు తెలిపారు. నూతన పైపులైన్‌ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం పరిష్కారం లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జలమండలి మేనేజర్‌ కుషాల్‌, బీఆర్‌ఎస్‌ నాయకులు శైలేందర్‌, కృష్ణ ముదిరాజ్‌, రవీంద్రసాగర్‌, అనిత, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

బీ కేటగిరి సీట్ల విక్రయాలను అరికట్టండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్‌ కోర్సుల్లో బీ కేటగిరి సీట్ల విక్రయాలను అరికట్టాలని కోరుతూ విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి వైస్‌ చైర్మన్‌ ప్రొ.ఇటికాల పురుషోత్తంకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్‌ విద్య అందరికీ అందుబాటులో ఉండాలని, నోటిఫికేషన్‌ ద్వారానే బీ కేటగిరి సీట్లను భర్తీ చేయాలన్నారు. అలాగే కాలేజీల్లో తనిఖీలు చేపట్టాలని, ఫీజులు నియంత్రించాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. టీపీయూవీ చైర్మన్‌ కంచర్ల బద్రి, టీజీఆర్‌ఎస్‌ఏ నేత డా.పాన్నం ముత్యంగౌడ్‌, బీసీఎస్‌ స్టేట్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ డా.జనగామ సంతోష్‌ పాల్గొన్నారు.

అకారణంగా దాడి చేసిన యువకుడిపై కేసు

సనత్‌నగర్‌: వ్యక్తిపై దాడి చేసిన ఘటన సనత్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్‌ డీఎస్‌ఎంకాలనీ ఈద్గా సమీపంలో ఉండే సయ్యద్‌ గౌస్‌ అలీ (33) వృత్తి రీత్యా వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 22న మధ్యాహ్నం 3 గంటలకు మూసాపేట నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా డీఎస్‌ఎంకాలనీ జాఫ్రీద్‌ మసీదు వద్దకు చేరుకోగానే అదే కాలనీకి చెందిన అవాద్‌ బిన్‌ ఖమోష్‌ (20) అలియాస్‌ పోపట్‌ అకారణంగా గొడవకు దిగాడు. దీంతో సయ్యద్‌ గౌస్‌ అలీ వెళ్లేందుకు యత్నిస్తుంటే మళ్లీ యువకుడు కర్ర తో దాడి చేయగా కుడి చేతిపై రక్తస్రావం జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.